RNI NO.TELTEL/2023/87655

# దీక్ష ప్రభ

తెలుగు దినపత్రిక

04-02-2026
బుధవారం, హైదరాబాద్

సంపుటి: 03 । సంచిక: 309
పేజీలు: 04 । వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్

FOLLOW:
https://epaper.deekshaprabhadaily.com



రాష్ట్రానికి దక్కాల్సిన నిధులను గరిష్ఠంగా సాధించాలి

2

## లోక్‌సభలో గందరగోళం

- కాగితాలు చించి విసిరిన విపక్ష సభ్యులు
- తీవ్రంగా స్పందించిన స్పీకర్ ఓంబిర్లా
- 8 మంది ఎంపీలపై సస్పెన్షన్ వేటు
- పార్లమెంట్ వెలుపల కాంగ్రెస్ ఎంపీల నిరసన
- విపక్షాల గొంతు నొక్కుతున్నారని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఫైర్
- బుధవారానికి సభ వాయిదా

**ఢిల్లీ, దీక్షప్రభ:** లోక్‌సభలో మరోసారి తీవ్ర గందరగోళం నెలకొంది. విపక్ష సభ్యుల ఆందోళనలతో సభ కార్యకలాపాలు మంగళవారం పూర్తిగా స్థంభించాయి. స్పీకర్ చైర్‌పై నిరసన వ్యక్తం చేస్తూ కొందరు సభ్యులు కాగితాలు చించి విసరడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆ ఘటనపై కఠినంగా స్పందించిన స్పీకర్ మొత్తం బడ్జెట్ సమావేశాల కాలానికి ఎనిమిది విపక్ష సభ్యులను సస్పెండ్ చేశారు. మంగళవారం మధ్యాహ్నం పలుసార్లు వాయిదాల అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు సభ మళ్లీ సమావేశమైంది. ఆ సమయంలో చైర్‌లో ఉన్న ఎంపీ దిలీప్ సైకియా సభను ప్రారంభించగానే విపక్ష సభ్యులు నిరసనలు చేపట్టారు. నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లిన కొందరు సభ్యులు పత్రాలు చించి స్పీకర్ వైపు విసరడం కలకలం రేపింది. సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించినందుకు ఎనిమిది మంది కాంగ్రెస్ సభ్యులను గుర్తించారు. సస్పెండ్ అయిన వారిలో ఎంపీలు హిబీ ఈడెన్, అమరీందర్ సింగ్, రాజావారింగ్, మాణికంఠా గూర్, గుర్జీత్ సింగ్, కిరణ్‌కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు. వీరిపై మిగిలిన బడ్జెట్ సమావేశాల కాలానికి సస్పెన్షన్ విధించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తీర్మానం ప్రవేశపెట్టారు. ఆ తీర్మానాన్ని సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. అనంతరం తీవ్ర గందరగోళం మిగతా2లో...





## భారత్-అమెరికా వాణిజ్య బంధంలో

# నవశకం

### మోదీ–ట్రంప్ 'చారిత్రాత్మక' ఒప్పందం

ప్రపంచంలోని రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల మధ్య వాణిజ్య యుద్ధ మేఘాలు తొలగిపోయాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య జరిగిన సుదీర్ఘ ఫోన్ సంభాషణ తర్వాత ఒక చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందం కుదిరింది. భారత ఉత్పత్తులపై విధిస్తున్న భారీ ప్రతీకార సుంకాలను 18 శాతానికి తగ్గిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు.

- సుంకాల భారం తగ్గించిన ట్రంప్!
- 18 శాతానికి పడిపోయిన దిగుమతి సుంకాలు
- రష్యా చమురుకు స్వస్తి.. అమెరికా ఇంధనానికి భారత్ మొగ్గు

2

## కడియం శ్రీహరికి స్పీకర్ నోటీసులు




- పార్టీ ఫిరాయింపు కేసులో కీలక పరిణామం
- బుధవారం ఉదయం 11 గంటలకు విచారణ
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద సైతం హాజరు!
- మరో ఏడుగురు ఎమ్మెల్యేలు విచారణ పిటిషన్లు పెండింగ్‌లోనే..
- ఇప్పటికే ఈ కేసులో సుప్రీం కోర్టు సీరియస్
- రెండు వారాల్లోగా తేల్చాలంటూ సభాపతి ప్రసాద్‌కుమార్‌పై ఆగ్రహం
- కడియం, దానంపై వేళాడుతున్న ఫిరాయింపు కత్తి !
- బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య రగులుతున్న అనర్హత పోరు

**హైదరాబాద్, దీక్షప్రభ:** తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల వ్యవహారం మరోసారి తీవ్ర చర్చకు దారితీసింది. గత కొద్ది నెలలుగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య నడుస్తున్న ఈ అనర్హత పోరు ఇప్పుడు కీలక దశకు చేరుకుంది. ముఖ్యంగా స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసులు జారీ చేయడం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. బుధవారం ఉదయం 11 గంటలకు స్పీకర్ ఎదుట మిగతా2లో...

## జగిత్యాలలో జగడం

### జీవన్‌రెడ్డి VS సంజయ్



- కాంగ్రెస్‌లో మరోసారి భగ్గుమన్న వర్గపోరు
- నిప్పు రాజేసిన మున్సిపల్ ఎన్నికల టికెట్లు
- మాజీ ఎమ్మెల్యే వర్గం తీవ్ర అసంతృప్తి
- హైకమాండ్ చిన్న చూపు చూస్తోందని ఆగ్రహం
- జీవన్‌రెడ్డి రాజీనామాకు సిద్ధమయ్యారని జోరుగా ప్రచారం

**హైదరాబాద్, దీక్షప్రభ:** మున్సిపల్ ఎన్నికల టికెట్ల పంపిణీ జగిత్యాల కాంగ్రెస్‌లో అగ్గి రాజేసింది. పట్టణంలోని మొత్తం 50 వార్డుల్లో ఎమ్మెల్యే సంజయ్ వర్గానికి 29, జీవన్ రెడ్డి వర్గానికి 21 టికెట్లు కేటాయించారు. దీంతో అధిష్ఠానం తీరుపై జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. టికెట్ల మిగతా2లో...



2

## మణిపూర్ సీఎంగా యుమ్నం..

- బీజేపీ శాసనసభా పక్ష నేతగా ఎన్నిక
- తరుణ్ చుగ్ సమక్షంలో ముఖ్యమంత్రి ఎంపిక
- 2025 ఫిబ్రవరి 13 నుంచి రాష్ట్రపతి పాలన
- తాజాగా ప్రభుత్వం ఏర్పాటుతో తొలగనున్న ఆంక్షలు
- 60 స్థానాలు ఉన్న అసెంబ్లీలో బీజేపీకి 37 మంది ఎమ్మెల్యేలు

తుదిదశలో భారత్–అమెరికా

## ట్రేడ్ డీల్

- దేశ భవిష్యత్‌ను మార్చే ఒప్పందం
- 140 కోట్ల భారతీయులకు ఉపయుక్తం
- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్



**ఢిల్లీ, దీక్షప్రభ:** భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందంపై కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు చేశారు. వ్యవసాయం, పాడి పరిశ్రమ రంగాల ప్రయోజనాలకు ఎలాంటి రాజీ లేకుండా అమెరికాతో భారత్ మిగతా2లో...



రెండు లక్షల ఉద్యోగాల హామీపై

## నాలుక మడత

### రిక్రూట్‌మెంట్లపై చేతులెత్తేసిన సర్కార్

- తెలంగాణలో నిలిచిపోయిన ఉద్యోగాల భర్తీ ప్రక్రియ
- రాష్ట్రంలోని అన్ని వర్గాలను మోసంచేసిన కాంగ్రెస్
- ద్రోహానికి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, దీక్షప్రభ:**

రెండు లక్షల ఉద్యోగాలు మొదటి ఏడాదిలోనే అని ఇచ్చిన మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని అడ్డదారిలో గద్దెనెక్కిన రేవంత్.. తీరా అది ఐదేళ్ల హామీ అని, పీసీసీ చీఫ్‌తో సీఎం పలికిస్తున్న చిలుక పలుకులు మిగతా2లో...

## అగ్రరాజ్యానికి ప్రధాని భయపడ్డారు

- ప్రజల కష్టార్జితాన్ని అమెరికాకు దోచిపెట్టారు
- ఈ విషయాలు దేశ ప్రజలకు తెలియకుండా చేస్తున్నారు
- లోక్‌సభలో తన ప్రసంగాన్ని అడ్డుకుంటున్నారు
- వాణిజ్య ఒప్పందంపై రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు
- రాహుల్ ఆరోపణలను తిప్పికొట్టిన అధికార పక్షం



2

## కేబినెట్ నిర్ణయం చాలు



2

- మా ఉత్తర్వులు అడ్డంకిగా లేవు
- గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికపై సుప్రీంకోర్టు క్లారిటీ
- తదుపరి విచారణ మార్చి 19కి వాయిదా..
- అజారుద్దీన్, కోదండరాం నియామకానికి అడ్డంకి తొలగినట్లే..

## రాష్ట్రానికి దక్కాల్సిన నిధులను గరిష్టంగా సాధించాలి

- అందుకోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలి
- జనాభా ప్రాతిపదికన తెలంగాణకు కనీసం రూ. 25 వేల కోట్లు రావాల్సి ఉంది
- ఈ నిధులను పొందేందుకు ప్రతి శాఖ పకడ్బందీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- సీఎస్ రామకృష్ణ రావు ఆదేశాలు

**హైదరాబాద్, దీక్షప్రభ:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 202627 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో రాష్ట్రానికి దక్కాల్సిన నిధులను గరిష్టంగా సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె. రామకృష్ణా రావు అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వంలో వినియోగం కాకుండా ఉన్న మిగులు నిధులను రాష్ట్రానికి మళ్లించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. డా. బీ.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో సీఎం ఆదేశాల మేరకు వివిధ శాఖల కార్యదర్శులతో సీఎస్ మంగళవారం కీలక సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రాయోజిత పథకాల (సీఎస్ఎస్) కోసం బడ్జెట్‌లో కేటాయించిన రూ. 5 లక్షల కోట్లలో, జనాభా ప్రాతిపదికన తెలంగాణకు కనీసం రూ. 25 వేల కోట్లు రావాల్సి ఉందని సీఎస్ స్పష్టం చేశారు. ఈ నిధులను పొందేందుకు ప్రతి శాఖ పకడ్బందీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

**రావాల్సిన రూ. 10 వేల కోట్ల బకాయిలు..**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రావాల్సిన మరో రూ. 10 వేల కోట్ల బకాయిల కోసం కార్యదర్శులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రాధాన్యతనిచ్చిన ఫార్మా రంగాభివృద్ధి, సెమీ కండక్టర్ తయారీ, వ్యవసాయ రంగాల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించాలని పేర్కొన్నారు. ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాలను కలుపుతూ టెంపుల్ కారిడార్‌ను అభివృద్ధి చేయాలని, మామునూరు ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తున్నందున ఈ ప్రాంతాల్లో టూరిజం, వాణిజ్య రంగాలను బలోపేతం చేయాలని సూచించారు. 16వ ఆర్థిక కమిషన్ మార్గదర్శకాల ప్రకారం 2011 జనాభా, డెమోగ్రాఫిక్ పనితీరు, పథకాల అమలు సామర్థ్యం ఆధారంగా నిధుల కేటాయింపు ఉంటుందని, ఆ దిశగా రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని తెలిపారు. ఈ సమావేశంలో స్పెషల్ సీఎస్‌లు సి.వి. ఆనంద్, వికాస్ రాజ్, జయేష్ రంజన్, సవ్య సాచి ఘోష్, అహ్మద్ నదీమ్, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, నవీన్ మిట్టల్, ఎన్. శ్రీధర్ వివిధ శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.

## తుదిదశలో భారత్‌అమెరికా ట్రేడ్ డీల్

(మొదటి పేజీ తరువాయి)

అత్యుత్తమ వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకుందని పీయూష్ గోయల్ తెలిపారు. ప్రస్తుతం వాణిజ్య ఒప్పందం తుది దశలో ఉందని, డీల్ పూర్తి స్వరూపంపై త్వరలోనే భారత్‌అమెరికా సంయుక్త ప్రకటన చేస్తాయని చెప్పారు. అమెరికాతో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వాణిజ్య ఒప్పందాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం కుదుర్చుకున్నారని గోయల్ తెలిపారు. 140 కోట్ల భారతీయులకు ఈ ట్రేడ్ డీల్ ఉపయుక్తంగా ఉంటుందని, దేశ ఆర్థిక వ్యవస్థకు దోహదం చేస్తుందని పేర్కొన్నారు. దేశ పౌరులకు అపారమైన అవకాశాలను తీసుకువస్తుందని వివరించారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంతో భారత్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ఈ డీల్‌ను భారత భవిష్యత్ మార్చే ఒప్పందమని అభివర్ణించారు.

**మోదీ - ట్రంప్ సత్సంబంధాలతో వాణిజ్య ఒప్పందం**

"మోదీ ట్రంప్ సత్సంబంధాలతో వాణిజ్య ఒప్పందం జరిగింది. వాణిజ్య ఒప్పందం ద్వారా భారత్‌కు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుంది. భారత్‌పై గతంలో అమెరికా 50 శాతం సుంకాలు విధించింది. మెరైన్, సీఫుడ్, వస్త్ర ఎగుమతిదారులు సుంకాలు తగ్గాలని ఆశించారు. ఇటీవల వరకు అమెరికా ఒప్పందం ఎప్పుడని విపక్ష నేతలు ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారు. చైనాతో ఎఫ్‌టీఏ కుదుర్చుకునే పాపం రాహుల్ గాంధీ చేశారు. చైనాతో ఎఫ్‌టీఏ నుంచి భారత్‌ను ప్రధాని మోదీ కాపాడారు. వ్యవసాయం, డెయిరీ రంగాల్లో భారత్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉంది. ఈ ఒప్పందం వల్ల దేశంలోని అన్ని వర్గాలూ హర్షం ప్రకటిస్తున్నాయి. వాణిజ్య ఒప్పందం వల్ల మత్స్యకారులు ఎంతో ఆనందంగా ఉన్నారు. వాణిజ్య ఒప్పందం మనదేశ ఉజ్జ్వల భవిష్యత్తుకు నాంది. వాణిజ్య ఒప్పందం వల్ల లక్షలమంది ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. టెక్స్‌టైల్స్, జెమ్, జ్యూయలరీ, ఆక్వా రంగాలకు ఎంతో లబ్ధి చేకూరుతుంది. బడుగు, బలహీనవర్గాలకు మేలు జరగడం రాహుల్‌కు ఇష్టం లేదు." అని పీయూష్ గోయల్ అన్నారు.


## అగ్రరాజ్యానికి ప్రధాని భయపడ్డారు

**హైదరాబాద్, దీక్షప్రభ:** అమెరికాతో వాణిజ్య ఒప్పందం చేసుకునేందుకు ప్రధాని నరేంద్ర మోదీ రాజీపడ్డారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఈ ఒప్పందం ద్వారా రైతుల కష్టాన్ని, దేశాన్ని అమ్మేశారని ధ్వజమెత్తారు. ఈ విషయాన్ని అన్నదాతలు అర్థం చేసుకోవాలని రాహుల్ పిలుపునిచ్చారు. అదానీపై అమెరికాలో కేసు, ఎప్‌స్టీన్ ఫైల్స్ కారణంగానే ప్రధాని రాజీపడ్డారని విమర్శించారు. ఈ విషయాలు దేశ ప్రజలకు తెలియకుండా ఉండేందుకు లోక్‌సభలో తన ప్రసంగాన్ని అధికార పక్షం అడ్డుకుందని రాహుల్ ఆరోపించారు. భారత జాతీయ ప్రయోజనాల విషయంలో ప్రధాని మోదీ రాజీపడ్డారని దుయ్యబట్టారు. లోక్‌సభ నుంచి బయటకు వచ్చిన అనంతరం పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 4 నెలలుగా ఆగిపోయిన ఒప్పందం సాయంత్రానికి ఎలా జరిగిందని ప్రతిపక్ష రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. ప్రధాని మోదీపై తీవ్రమైన ఒత్తిడి ఉందన్నారు. సభలో ప్రతిపక్ష నేతను మాట్లాడకుండా అడ్డుకోవటం ఇదే మొదటిసారి అని రాహుల్ అన్నారు.

"అదానీపై అమెరికాలో ఓ కేసు ఉంది. వాస్తవానికి ఆ కేసు మోదీపై పెట్టాల్సిన కేసు. వారు అదానీని టార్గెట్ చేయటంలేదు. వారు నరేంద్ర మోదీ ఆర్థిక నిర్మాణాన్ని టార్గెట్ చేశారు. రెండోది ఎప్‌స్టీన్ ఫైల్స్ అవి ఇంకా విడుదల కాలేదు. అమెరికా బయటపెట్టని ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో చాలా విషయాలున్నాయి. ఎప్‌స్టీన్ ఫైల్స్ విషయంలో మోదీపై చాలా ఒత్తిడి ఉంది. వాటి ఒత్తిడితోనే ప్రధాని రాజీపడ్డారు. ప్రధాని అమెరికాకు ఎందుకు లొంగిపోయారన్నది ప్రజలు అర్థం చేసుకోవాలి." అని రాహుల్ గాంధీ అన్నారు. మరోవైపు వాణిజ్య ఒప్పందం విషయమై అమెరికా ఒత్తిడికి ప్రధాని మోదీ తలొగ్గారన్న ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శలను అధికారపక్షం తిప్పికొట్టింది. కాంగ్రెస్ పార్టీ, ఇతర ప్రతిపక్షాలు దేశ ప్రయోజనాలకు అనుకూలమా? లేక వ్యతిరేకమా? చెప్పాలని బీజేపీ ఎంపీ, మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్ డిమాండ్ చేశారు.

# భారత్-అమెరికా వాణిజ్య బంధంలో నవశకం

**ఢిల్లీ, దీక్షప్రభ:** ప్రపంచంలోని రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల మధ్య వాణిజ్య యుద్ధ మేఘాలు తొలగిపోయాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య జరిగిన సుదీర్ఘ ఫోన్ సంభాషణ తర్వాత ఒక చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందం కుదిరింది. భారత ఉత్పత్తులపై విధిస్తున్న భారీ ప్రతీకార సుంకాలను 18 శాతానికి తగ్గిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ పరిణామం అటు అమెరికా మార్కెట్‌లో భారతీయ వస్తువులకు ఊపిరి పోయడంతో పాటు, ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలను మరో స్థాయికి తీసుకెళ్లింది.



**ట్రంప్ 'ట్రూత్' సోషల్ వేదికగా సంచలన ప్రకటన..**

ప్రధాని మోదీతో సంభాషణ అనంతరం ట్రంప్ సోషల్ మీడియాలో తన సంతోషాన్ని పంచుకున్నారు. "నా స్నేహితుడు మోదీ ఒక శక్తిమంతమైన నాయకుడు. ఆయన విజ్ఞప్తిని గౌరవిస్తూ భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తున్నాను. రష్యా నుంచి చమురు దిగుమతులను నిలిపివేసి, అమెరికా, వెనిజులా నుంచి ఇంధనాన్ని కొనుగోలు చేసేందుకు భారత్ అంగీకరించింది. దీనివల్ల ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే అవకాశం ఉంది" అని ట్రంప్ పేర్కొన్నారు.

**సుంకాల లెక్కలివే..**

ఇప్పటివరకు భారతీయ ఉత్పత్తులపై అమెరికా దాదాపు 50 శాతం సుంకాలు విధిస్తోంది. ఇందులో రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు శిక్షాత్మకంగా విధించిన 25 శాతం అదనపు సుంకం కూడా ఉంది. తాజా ఒప్పందంతో మొత్తం సుంకం 18 శాతానికి తగ్గించింది. అమెరికా ఉత్పత్తులపై భారత్ విధిస్తున్న సుంకాలు సున్నా స్థాయికి చేర్చింది. దాదాపు 500 బిలియన్ డాలర్ల విలువైన టెక్నాలజీ, వ్యవసాయం, ఇంధన ఉత్పత్తులను భారత్ దిగుమతి చేసుకోనుంది.

**ధన్యవాదాలు తెలిపిన ప్రధాని మోదీ..**

అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయంపై మోదీ స్పందిస్తూ, 140 కోట్ల మంది భారతీయుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. "రెండు దేశాలు కలిసి పనిచేస్తే ప్రపంచ శాంతికి, సుస్థిరతకు మార్గం సుగమమవుతుంది. అమెరికా సుంకాల తగ్గింపు ఎంతో సంతోషకరం. ట్రంప్ నాయకత్వంలో మా భాగస్వామ్యం అత్యున్నత స్థాయికి చేరుతుందని నమ్ముతున్నాను" అని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

**జైశంకర్ పర్యటన వేళ కీలక మలుపు..**

భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అమెరికా పర్యటన ప్రారంభమైన రోజే ఈ ప్రకటన రావడం గమనార్హం. దీనివల్ల భారతీయ ఎగుమతిదారులు, ముఖ్యంగా టెక్నాలజీ, తయారీ రంగాలకు భారీ ఊరట కలగనుంది. 'మోదీట్రంప్' ద్వయం ప్రపంచ రాజకీయ, ఆర్థిక సమీకరణాలను సమూలంగా మార్చే దిశగా అడుగులు వేస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## రెండు లక్షల ఉద్యోగాల హామీపై నాలుక మడత

(మొదటి పేజీ తరువాయి)

చూసి యువతరం ఛీకొడుతోందని అన్నారు. తొలి సంవత్సరమే రెండు లక్షల నియామకాలు చేపట్టకపోతే ప్రభుత్వాన్ని దించేయండని ఢిల్లీ నుంచి వచ్చి మరీ చెప్పిపోయిన ప్రియాంక గాంధీ మాట అమలై ఉంటే.. ఈ దగాకోరు సర్కారు కుప్పకూలి ఇప్పటికే ఏడాది పూర్తయ్యేదన్నారు కేటీఆర్. కేసీఆర్ హయాంలో చివరి దశలో ఉన్న 65 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చి ఫోటోలకు ఫోజులు కొట్టిన సీఎం, ఆ తరువాత మొత్తానికే చేతులెత్తేయడంతోనే తెలంగాణలో 'రిక్రూట్‌మెంట్ జీరో'గా మారిపోయిందని కాంగ్రెస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ఎండగట్టారు.

**జాబ్ క్యాలెండర్‌కు పాతరేసి..**

అప్పటికే లక్షా 65 వేల ఉద్యోగాలను భర్తీ చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై పనిగట్టుకుని రేవంత్ చల్లిన బురద అంతా అబద్ధాలతో అందలం ఎక్కడానికేనని అందరికీ అర్థమైపోయిందని, పట్టుమని 10 వేల కొత్త ఉద్యోగాలకు కూడా నోటిఫికేషన్లు ఇవ్వని చేతకాని దద్దమ్మ పాలన చూసి నిరుద్యోగులే కాదు, వారి తల్లిదండ్రులు కూడా దుమ్మెత్తి పోస్తున్నారన్నారు. జాబ్ క్యాలెండర్‌కు పాతరేసి, వరుస కుంభకోణాలతో రేవంత్ సర్కారు జేబులు నింపుకుంటున్న తీరును నిత్యం తెలంగాణ సమాజం గమనిస్తూనే ఉందని, రెండు లక్షల ఉద్యోగాల హామీపై నాలుక మడతేసినంత మాత్రాన నాలుగు కోట్ల ప్రజలు ఊరుకుంటారని, ముఖ్యమంత్రి చేసిన మోసాన్ని మరిచిపోతారని అనుకుంటే అది పొరపాటే అని హెచ్చరించారు. తెలంగాణ నిరుద్యోగులను నమ్మించి నయవంచన చేసినందుకు ముఖ్యమంత్రి ముక్కున వేలేసుకుని క్షమాపణలు చెప్పినా, పొర్లుదండాలు పెట్టినా క్షమించే ప్రసక్తే లేదని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిరుద్యోగులకు, విద్యార్థులకు చేస్తున్న ఈ ద్రోహంపై వెంటాడుతామన్నారు.

**మీరు చేసిన పాపం ఊరికే పోదు..**

మేధావుల ముసుగు వేసుకుని మాయ మాటలతో మభ్యపెట్టిన గొంతులన్నీ గత రెండేళ్ల నుంచి మూగబోయినంత మాత్రాన మీరు చేసిన పాపం ఊరికే పోదని, నిరుద్యోగులకు, యువతకు అండగా ఉండాల్సిన బాధ్యత ఉందన్నారు కేటీఆర్. కేవలం నిరుద్యోగులను మాత్రమే కాకుండా రాష్ట్రంలోని అన్ని వర్గాలను రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఇప్పటికే మూడు దఫాలుగా రైతుబంధు ఎగ్గొట్టి 70 లక్షల మంది అన్నదాతల పొట్టకొట్టారు. కేసీఆర్ పాలనలో ఆత్మగౌరవంతో బతికిన రైతన్నను మళ్లీ అప్పులపాలు చేసి తీరని ద్రోహం చేశారని తెలిపారు. సీఎం సీటుపై కూర్చున్న మరుక్షణంలోనే ప్రతి మహిళకు రూ.2500 ఇస్తానని చెప్పిన మాటలకు రెండేళ్లయినా ఒక్కరికీ దిక్కులేకపోవడంతో ఆడబిడ్డలు కోపంతో రగిలిపోతున్నారన్నారు. ఆరు గ్యారెంటీలన్నీ అక్షరాలా గారడీలేనని, 420 హామీలన్నీ నయవంచన మాత్రమేనని తన నిజస్వరూపాన్ని బయటపెట్టిన రేవంత్ సర్కారుకు నిరుద్యోగుల ఉసురు తగలడం ఖాయం అన్నారు. మెగా డీఎస్సీ పేరిట దగా, నిరుద్యోగ భృతి పేరిట చేసిన ద్రోహానికి గుణపాఠం చెప్పేందుకు ఆదిలాబాద్ నుంచి అశోక్ నగర్ చౌరస్తా వరకూ ప్రతి నిరుద్యోగి సిద్ధంగా ఉన్నాడని తెలిపారు. చైతన్యానికి ప్రతీకైన తెలంగాణ యువత సంఘటిత శక్తిలో ఉన్న బలం ఏంటో, వారు బిగించే పిడికిళ్లు కాంగ్రెస్ పునాదులను ఎలా పెకిలిస్తాయో త్వరలోనే చూస్తామని కేటీఆర్ తెలిపారు.

## లోక్‌సభలో గందరగోళం

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగడంతో లోక్‌సభ బుధవారానికి వాయిదా పడింది.

**పార్లమెంట్ వెలుపల నిరసన**

మరోవైపు, ఎంపీల సస్పెన్షన్‌పై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో పార్టీ ఎంపీలు పార్లమెంట్ భవనం వెలుపల నిరసన వ్యక్తం చేశారు. అవన్నీ ప్రజాస్వామ్య హక్కులను హరించే చర్యలని తెలిపారు. విపక్ష స్వరాన్ని అణిచివేస్తున్నారని వారు ఆరోపించారు. సభ్యులను సస్పెండ్ చేయడం అన్యాయమని, వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లోక్‌సభ నుంచి సస్పెండ్ అయిన తర్వాత హిబీ ఈడెన్ మాట్లాడుతూ, "ప్రతిపక్ష నాయకుడు పార్లమెంటు లోపల ఎందుకు మాట్లాడలేకపోతున్నారో స్పష్టంగా చెప్పారు. దానికి కారణం ప్రధానమంత్రి అమెరికా ముందు లొంగిపోయిన తీరు, వాణిజ్య ఒప్పందం కుదిరిన విధానం, ఆ ఒప్పందంలో జరిగిన అక్రమాలే. ఎప్‌స్టీన్ విషయం పార్లమెంటులో చర్చించాల్సిన అంశం, కానీ ఈ విషయాలేవీ చర్చించడం లేదు. మేం సభ లోపల, వెలుపల మా నిరసనను కొనసాగిస్తాం. మా ఎనిమిది మంది ఎంపీలను సస్పెండ్ చేశారు, కానీ మేం పార్లమెంటు లోపల, వెలుపల మా పోరాటాన్ని కొనసాగిస్తాం" అని తెలిపారు.

**చర్చకు భయపడుతోంది: రాహుల్‌గాంధీ**

అయితే లోక్ సభలో గందరగోళానికి కారణంగా భారత్ చైనా సరిహద్దు ఘర్షణలకు సంబంధించిన అంశం నిలిచింది. 2020లో జరిగిన భారత్ చైనా ఘర్షణలపై మాజీ ఆర్మీ చీఫ్ నరవణె రాసిన ప్రచురితం కాని పుస్తకంలోని కొన్ని విషయాలను సభలో ప్రస్తావించాలని రాహుల్ గాంధీ ప్రయత్నించారు. అయితే అవి అధికారికంగా వెలువడని సమాచారమని పేర్కొంటూ స్పీకర్ అనుమతి ఇవ్వలేదు. దీంతో కాంగ్రెస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ నిరసనలు ప్రారంభించారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ, ప్రభుత్వం కీలక జాతీయ భద్రతా అంశాలపై చర్చకు భయపడుతోందని ఆరోపించారు. సైన్యానికి సంబంధించిన విషయాలపై పారదర్శకత ఉండాలని, పార్లమెంట్‌లో చర్చించేందుకు అవకాశం ఇవ్వాలని అన్నారు. సభలో తమకు మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడమే కాకుండా సభ్యులను సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. మరోవైపు అధికార పక్షం మాత్రం విపక్షంపై మండిపడింది. సభా నియమాలను పాటించకుండా, అల్లరి సృష్టించడం సమంజసం కాదని పేర్కొంది. సభా కార్యకలాపాలను అడ్డుకోవడం ప్రజల సమస్యల పరిష్కారానికి ఆటంకమని వ్యాఖ్యానించింది. చర్చలు జరపడానికి సభ ఉందని, హింసాత్మక చర్యలు సరైన మార్గం కాదని తెలిపింది.

## మణిపూర్ సీఎంగా యుమ్నం..

**ఢిల్లీ, దీక్షప్రభ:** మణిపూర్ నూతన ముఖ్యమంత్రిగా యుమ్నం ఖేమ్‌చంద్ సింగ్ ఎంపికయ్యారు. మంగళవారం జరిగిన పార్టీ సమావేశంలో బీజేపీ కేంద్ర పరిశీలకుడు తరుణ్ చుగ్, పార్టీ ఈశాన్య రాష్ట్రాల ఇన్‌ఛార్జ్ సంబిత్ పాత్రా తదితరుల సమక్షంలో వై.ఖేమ్‌చంద్ సింగ్‌ను బీజేపీ శాసనసభా పక్ష నేతగా ఎన్నుకున్నారు. దీనితో ఈశాన్య రాష్ట్రమైన మణిపుర్‌లో ఆయన నాయకత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కానుంది. మణిపుర్‌లో 2025 ఫిబ్రవరి 13 నుంచి రాష్ట్రపతి పాలన కొనసాగుతోంది. దీనితో 60 మంది సభ్యుల అసెంబ్లీని అప్పటి నుంచి సుప్తచేతనావస్థలో ఉంచారు. తాజాగా ప్రభుత్వం ఏర్పాటు కానుండడంతో ఆ ఆంక్షలు తొలగిపోనున్నాయి. 60 స్థానాలు ఉన్న మణిపుర్ అసెంబ్లీలో, బీజేపీకి 37 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. (వాస్తవానికి 2022 ఎన్నికల్లో మొదట బీజేపీ 32 సీట్లు బీజేపీ గెలుచుకోగా, తరువాత ఆరుగురు జేడీయూ ఎమ్మెల్యేల్లో ఐదుగురు బీజేపీలో చేరారు.) కాగా నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) 6, నాగా పీపుల్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్) 5, కాంగ్రెస్ 5, కుకీ పీపుల్స్ అలయన్స్ (కేపీఏ) 2, జనతాదళ్ (యునైటెడ్)కు 1 ఎమ్మెల్యే చొప్పున ఉన్నారు. కాగా ముగ్గురు స్వతంత్రులు కూడా ఉన్నారు. ప్రస్తుతం ఒక సిట్టింగ్ ఎమ్మెల్యే మరణించడంతో ఆ అసెంబ్లీ స్థానం ఖాళీగా ఉంది.

## జగిత్యాలలో జగడం

(మొదటి పేజీ తరువాయి)

విషయంలో తన గొంతు కోశారంటూ అనుచరుల ఎదుట జీవన్ రెడ్డి కలత చెందినట్లు తెలుస్తోంది. ఈమేరకు మంగళవారం మాజీ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి నివాసం వద్ద పార్టీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికే టికెట్లు కేటాయిస్తున్నారంటూ జీవన్ రెడ్డి వద్ద వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈక్రమంలోనే ఇక రాజీ లేదు.. రాజీనామానే అంటూ కార్యకర్తలకు జీవన్ రెడ్డి స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఎమ్మెల్యే సంజయ్ నివాసం వద్ద భారీగా పోలీసులు మోహరించారు.

**హైకమాండ్ లైట్ తీసుకుంటోందా?**

2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా సంజయ్ బరిలో దిగి.. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డిపై విజయం సాధించారు. అనంతరం సంజయ్.. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకునేందుకు సిద్ధమయ్యారు. అయితే కాంగ్రెస్ పార్టీలోకి సంజయ్ రాకను జీవన్ రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. పార్టీ పెద్దలు వెంటనే రంగంలోకి దిగి.. జీవన్ రెడ్డిని శాంతింపచేశారు. దాంతో కాంగ్రెస్ పార్టీలో సంజయ్ చేరారు. నాటి నుంచి జగిత్యాల కాంగ్రెస్ పార్టీలో రెండు వర్గాలు తయారయ్యాయి. వాటిలో ఒకటి జీవన్ రెడ్డి వర్గం కాగా.. మరొకటి సంజయ్ వర్గం. ఈ వర్గాల మధ్య పోరు ఇటీవల మరింత తీవ్రమైంది. ఒక వర్గంపై మరో వర్గం ఆధిక్యాన్ని ప్రదర్శించేందుకు అందివచ్చిన ప్రతి అవకాశాన్నీ ఉపయోగించుకొంటుంది. దీంతో జగిత్యాలలో ఇరు వర్గాల మధ్య జగడం నిత్యకృత్యంగా మారింది. అలాంటి వేళ పార్టీ వీడేందుకు సీనియర్ నేత టి.జీవన్ రెడ్డి సన్నాహకాలు చేసుకుంటున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈక్రమంలోనే ఏడాదిన్నరగా ఎమ్మెల్యే సంజయ్, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటి వరకూ జీవన్ రెడ్డిని శాంతింప చేసేందుకు హైకమాండ్ సైతం ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. కనీసం ఆయనకు కాంగ్రెస్ పెద్దలు ఫోన్ సైతం చేయకపోవడం గమనార్హం. దాంతో జీవన్‌రెడ్డిని హైకమాండ్ లైట్ తీసుకుందంటూ ఒక ప్రచారం పార్టీలో జోరుగా నడుస్తోంది.

## కేబినెట్ నిర్ణయం చాలు

**హైదరాబాద్, దీక్షప్రభ:** తెలంగాణ రాష్ట్రంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపిక విషయంలో సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. ఎమ్మెల్సీల ఎంపికకు అడ్డంకిగా తమ ఉత్తర్వులు లేవని తేల్చి చెప్పింది. గత సంవత్సరం ఆగస్టు 13 నాటి మధ్యంతర ఉత్తర్వుల్లోనే స్పష్టంగా చెప్పామని జస్టిస్ విక్రంనాథ్ ధర్మాసనం తెలిపింది. కేబినెట్ నిర్ణయానికి అనుగుణంగా గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టం చేసింది. తమ ఎన్నికపై జారీ చేసిన ఉత్తర్వులు ఎత్తివేయాలని అమిర్ అలీ సుప్రీంకోర్టులో వెకేట్ పిటిషన్ వేశారు. అమిర్ అలీ పిటిషన్‌ను దాసోజు శ్రవణ్ వేసిన ప్రధాన పిటిషన్‌తో జత చేస్తూ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ధర్మాసనం మార్చి 19కి వాయిదా వేసింది. ఈ తీర్పుతో అజారుద్దీన్, కోదండరాం నియామకానికి దాదాపు అడ్డంకి తొలగినట్లే.

**2023 నుంచి గందరగోళం**

2023లో గవర్నర్ కోటాలో బీఆర్ఎస్ ప్రభుత్వం సిఫార్సు చేసిన దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణల ఎమ్మెల్సీ నామినేషన్లను అప్పటి తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తిరస్కరించారు. వీరు రాజ్యాంగంలోని 171(5) ప్రకారం సాహిత్యం, శాస్త్రం, కళలు, సహకార ఉద్యమం, సమాజ సేవలో ప్రత్యేక అనుభవం లేని, రాజకీయ నేపథ్యం ఉన్నవారనే కారణంతో గవర్నర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక 2024లో రాష్ట్రంలో గవర్నర్ కోటా కింద ప్రొఫెసర్ ఎం. కోదండరాం, మహమ్మద్ అజారుద్దీన్ పేర్లను సిఫారసు చేయగా గవర్నర్ ఆమోదించారు. ఈ నియామకాన్ని సవాల్ చేస్తూ దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ తొలుత హైకోర్టును, ఆ తర్వాత సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై 2025 ఆగస్టు 13న విచారణ జరిపిన న్యాయస్థానం కోదండరామ్, అలీఖాన్ నియామకాలను రద్దు చేసింది. తదుపరి ఉత్తర్వులకు లోబడే ఈరెండు స్థానాలను భర్తీచేయాలని ఆదేశించిన సంగతి తెలిసిందే.



# కడియం శ్రీహరికి స్పీకర్ నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని కడియంకు ఆదేశాలు అందాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ గుర్తుపై గెలిచిన కడియం శ్రీహరి, రాష్ట్రంలో మారిన రాజకీయ సమీకరణాల నేపథ్యంలో తన కుమార్తె కావ్య భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కారు గుర్తుపై గెలిచి హస్తం గూటికి చేరడం నిబంధనలకు విరుద్ధమని, ఆయనపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును స్వీకరించిన స్పీకర్ కార్యాలయం, సహజ న్యాయ సూత్రాల ప్రకారం ఇరు పక్షాల వాదనలు వినాలని నిర్ణయించింది. ఈ క్రమంలోనే కడియం శ్రీహరితోపాటు, ఫిర్యాదుదారుడైన వివేకానందకు కూడా నోటీసులు అందాయి. నేటి విచారణలో ఫిరాయింపునకు సంబంధించిన ఆధారాలను వివేకా సమర్పించనుండగా, తనపై వచ్చిన ఆరోపణలను కడియం ఎలా తిప్పికొడతారనేది ఆసక్తికరంగా మారింది.

**ఆధారాల్లేవ్**

ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై అనర్హత వేటు వేయాలన్న పిటిషన్‌పై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నేడు విచారణ చేపట్టనున్నారు. కాగా భారత రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం ట్రిబ్యునల్ చైర్మన్ అయిన స్పీకర్, పిటిషనర్ తరపున సాక్ష్యాలను నమోదు చేస్తారు. మాజీ ఉప ముఖ్యమంత్రి అయిన శ్రీహరి, 2024లో అధికార కాంగ్రెస్ పార్టీకి విధేయులుగా మారారని ఆరోపించబడిన 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలలో ఒకరు. స్పీకర్ గత సంవత్సరం ఎనిమిది మంది ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లపై విచారణను పూర్తి చేసి, ఏడుగురు ఎమ్మెల్యేలకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేశారు. స్పీకర్ ఆ పిటిషన్లను కొట్టివేసి, ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి ఫిరాయించారని ఆధారాలు అందించడంలో పిటిషనర్లు విఫలమయ్యారని తీర్పు ఇచ్చారు. ఎమ్మెల్యేలందరూ సాంకేతికంగా ఇప్పటికీ బీఆర్ఎస్‌లోనే ఉన్నారని ఆయన అన్నారు.



**ఆ ఇద్దరిపై వేటే..?**

అయితే ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై వచ్చిన అనర్హత పిటిషన్లపై స్పీకర్ జనవరి 30న విచారణ ప్రారంభించగా.. పిటిషనర్లలో ఒకరైన బీజేపీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి అభ్యర్థన మేరకు ఫిబ్రవరి 18కి వాయిదా వేయాల్సి వచ్చింది. ఈ కేసులో తన వాదనలు వినిపించేందుకు మరింత సమయం కావాలని మహేశ్వర్ రెడ్డి కోరారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత విచారణను షెడ్యూల్ చేయాలని స్పీకర్‌ను కోరారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే, పిటిషనర్ పాడి కౌశిక్ రెడ్డి న్యాయవాది నాగేందర్‌ను అనర్హత వేటు వేయాలని కోరుతూ స్పీకర్‌కు అఫిడవిట్ సమర్పించారు. బీఆర్ఎస్ టిక్కెట్‌పై అసెంబ్లీకి ఎన్నికైన తర్వాత నాగేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరడమే కాకుండా 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ టిక్కెట్‌పై సికింద్రాబాద్ నుండి పోటీ చేశారని ఆయన వాదించారు. స్పీకర్‌కు కౌంటర్ అఫిడవిట్ సమర్పించిన నాగేందర్, ఫిర్యాదుదారులు మీడియా నివేదికలపై మాత్రమే ఆధారపడి ఉన్నారని వాదిస్తూ, పిటిషన్లను కొట్టివేయాలని కోరారు. 2023లో హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎన్నికైన నాగేందర్, 2024 మార్చిలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశానికి తన వ్యక్తిగత హోదాలో హాజరయ్యానని చెప్పారు.

**ఇప్పటికే స్పీకర్‌పై సుప్రీం కోర్టు ఆగ్రహం**

తెలంగాణలో పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై గత నెలలో సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ క్రమంలో తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి అత్యున్నత న్యాయస్థానం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారాన్ని తేల్చేందుకు తగిన సమయం ఇచ్చినా ఇంకా నిర్ణయం తీసుకోకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల పిటిషన్లపై స్పీకర్ నిర్ణయం తీసుకుంటారా.. లేదంటే తామే నిర్ణయం తీసుకోవాలా అని కోర్టు ప్రశ్నించింది. ఈ విషయంలో స్పీకర్‌కు మరో అవకాశం ఇచ్చిన సుప్రీంకోర్టు.. రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకోకపోతే.. తామే నిర్ణయం తీసుకుంటామని స్పష్టంచేసింది. రెండు వారాల్లో ఎమ్మెల్యేల అనర్హత వేటుపై స్పీకర్ తీసుకున్న చర్యల అఫిడవిట్ ఇవ్వాలని ఆదేశించింది. ఈ క్రమంలో స్పీకర్ తరపు న్యాయవాది.. ఇప్పటివరకు స్పీకర్ ఏడుగురు ఎమ్మెల్యేలకు సంబంధించిన పిటిషన్లపై తీసుకున్న చర్యలను కోర్టుకు విన్నవించారు. మిగతా వారిపై నిర్ణయం తీసుకోకపోవడంతో ధర్మాసనం అసంతృప్తి వ్యక్తంచేసింది. దీంతో మిగతా వారిపై 2 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది.

## బ్రహ్మోత్సవాల్లో ఆకట్టుకున్న పొట్టి ఎడ్ల బండి



**నర్సింహులపేట,దీక్ష ప్రభ:** మండలంలోని జయపురం గ్రామంలో రుక్మిణీ సమేత వేణుగోపాల స్వామి, సీతారామస్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు, బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా సాగుతున్నాయి. మంగళవారం స్వామివారికి నిత్యహోమం, మహాపూర్ణాహుతి, చక్రస్నానం, ఆరగింపు, తీర్థప్రసాద వితరణ, పారువేట, ద్వాదశ ఆరాధనలు, పుష్పయాగం, ధ్వజ అవరోహణము, ముఖబలి ప్రసాద వితరణ, ఋత్విక్ సన్మానం తదితర పూజా కార్యక్రమాలను అర్చకులు శ్రీకాంతచార్యులు, అర్చకులు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.అనంతరం స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో పొట్టి ఎడ్ల బండి వినూత్నంగా ఆకట్టుకుంది. ఇటీవల జయపురం గ్రామానికి చెందిన వంగాల ప్రవీణ్ రెడ్డి రూ.లక్షతో పొట్టి బండిని తయారు చేయించారు. ఉత్సవాల సందర్భంగా ఈ బండి ప్రత్యేక ఆకర్షణగా ఎద్దులను ముస్తాబు చేసి, బండికి రంగులు వేసి, మంగళహారతులతో ప్రజలు ఘనస్వాగతం పలికారు.ఈ సాంప్రదాయ ఎడ్ల బండి గ్రామ జీవనశైలిని, పాత రోజులను గుర్తుచేస్తూ చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రామస్థులందరూ ఈ బండిని ఆసక్తిగా తిలకించారు. దేవాలయ ఆవరణలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరుగుతున్న వేడుకలలో సర్పంచ్ నేలకుర్తి రేణుక అశోక్ రెడ్డి,ఆలయ నిర్వాహకులు, వివిధ పార్టీల నాయకులు,భక్తులు పాల్గొన్నారు.

## సుద్దులం గ్రామంలో ఎల్లమ్మ మందిర పంచమ వార్షికోత్సవం



**కోటగిరి,దీక్ష ప్రభ:** మండలంలోని సుద్దులం గ్రామంలో ఎల్లమ్మ మందిర పంచమ వార్షికోత్సవ వేడుకలు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఆలయ వార్షికోత్సవం సందర్భంగా భక్తులు ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయంలో వేదమంత్రాలతో హోమం,అభిషేకం, అర్చన,హారతి,ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.అమ్మవారి కృపతో గ్రామం సుభిక్షంగా ఉండాలని గ్రామస్తులు కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మీనా జగన్నాథరావు పటేల్,ఉప సర్పంచ్ జాదవ్ సుస్మిత సోపాన్, మాజీ సర్పంచ్ గోపు సాయిలు, గ్రామ పెద్దలు సురేష్ పటేల్,రామారావు పటేల్,గోవిందరావు పటేల్,రఘు పటేల్,కారోబార్ శివకుమార్,ఈశ్వర్, యువకులు,మహిళలు,చిన్నారులు పాల్గొన్నారు.

## లోక్ సభ స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లాను మర్యాద పూర్వకంగా కలిసిన టీడీపీ ఎంపీలు

- లోక్ సభ స్పీకర్ అనుభవం, ఆలోచనలు మాకు ప్రేరణ
- ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** న్యూ ఢిల్లీలోని భారత పార్లమెంట్ భవనం లోని లోక్ సభ స్పీకర్ ఛాంబర్ లో మంగళవారం లోక్ సభ స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లాను నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు,లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి,సహచర టిడిపి ఎంపీలతోమర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య విలువలు, పార్లమెంటరీ సంప్రదాయాలు,ప్రజాప్రతినిధుల పాత్రపై లోక్ సభ స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లాతో సార్ధకమైన చర్చ జరిగిందనీ,భారత దేశానికి మార్గదర్శకంగా నిలుస్తున్న స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లా అనుభవం, ఆలోచనలు మాకు మరింత ప్రేరణనిచ్చాయని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చెప్పారు.

## ఘనంగా మొహమ్మద్ మొయిన్ జన్మదిన వేడుకలు

**జహీరాబాద్,దీక్ష ప్రభ:** తెలంగాణ రాష్ట్ర మీసేవ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ మొయిన్ జన్మదినన్ని పురస్కరించుకుని మంగళవారం నాడు జహీరాబాద్ పట్టణంలో మాజి ఐడిసి చైర్మన్ మొహమ్మద్ తన్విర్ స్వగ్రహంలో వారి ద్వారా సన్మానం పొంది కేక్ కట్ చెయ్యడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మర్రి బాల్ రెడ్డి,బిజీ సందీప్ కుమార్,గోవర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





# రాయలసీమ, ఎత్తిపోతల ప్రాజెక్టును పరిశీలించిన ఎమ్మెల్యేలు

- నంద్యాల జిల్లా అధ్యక్షురాలు మరియు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి
- నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య



**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** రాయలసీమ,ఎత్తిపోతల ప్రాజెక్టును ఎమ్మెల్యేలు పరిశీలించారు.ఈ సందర్భంగా మీడియా సమావేశంలో ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి మాట్లాడుతూ..రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ చుట్టూ వైస్సార్సీపీ చేస్తున్న విషయం రాజకీయ ప్రచారాన్ని చేస్తున్నారు.ఈ రోజు రాయలసీమలో ప్రస్తుతం ఉన్న అన్ని నీటిపారుదల ప్రాజెక్టులు,జలాశయాలలో నీటి లభ్యత నిండుగా ఉంది అన్నారు, అయితే వైస్సార్సీపీ తన రాజకీయ ప్రయోజనాల కోసం కృత్రిమ నీటి సంక్షోభాన్ని సృష్టించే ప్రయత్నం ఏ విధంగా చేస్తుందో ప్రజలకు తెలుసు అని అన్నారు.ఈ రాయలసీమ అంతటా నీటి లభ్యత,కొనసాగుతున్న నీటిపారుదల వినియోగం, వ్యవసాయ కార్యకలాపాలు మరియు రైతుల విశ్వాసాన్ని కళ్లకు కట్టినట్లు చూపించడం ద్వారా ప్రజలకు కూటమి ప్రభుత్వం పట్ల ఉన్న విశ్వసనీయత మరింత బలోపేతం చేస్తుందని అన్నారు.నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం రాయలసీమలో నీటి కొరత లేదుప్రస్తుతం ఉన్న కాలువలు, జలాశయాలు మరియు ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు అందుబాటులో ఉంది అన్నారు.నీరు అందించడానికి రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని వెంటనే పునః ప్రారంభించాలనే వాదన, కానీ ఇప్పటికే క్షేత్రస్థాయిలో నీటిని అందిస్తున్న అనేక ఇతర ప్రాజెక్టులను ప్రభుత్వం క్షేత్రస్థాయిలో నీరు అందేలా పని చేస్తోంది అన్నారు. గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం తమ హయంలో సాగునీటి పనులను నిలిపివేసి, ఇప్పుడు నిరసనలకు దిగగా, ప్రస్తుత మన కూటమి ప్రభుత్వం రూ.12,441/కోట్ల విలువైన సాగునీటి పనులను పూర్తి చేసి, పునరుద్ధరించి రైతులకు నీటి లభ్యతను హామీ ఇచ్చిందిఅన్నారు.ఇది నినాదాలకు, నిశ్శబ్దానికి మధ్య జరుగుతున్న పోరాటం కాదు; ఇది ప్రత్యక్షంగా కనిపిస్తున్న నీరు, పనిచేస్తున్న కాలువలు మరియు సాగులో ఉన్న పొలాలకు, రాజకీయంగా సృష్టించబడిన ఆందోళనకు మధ్య ఉన్న వ్యత్యాసం అన్నారు.పొలాలకు సాగునీరు అందుతోందని ధృవీకరించడానికి నాయకులు రైతులతో నేరుగా మాట్లాడాలి.వ్యవసాయ పనులు సాగుతున్నాయని మరియు వైకాపా నాయకులు ఆరోపణలు వాస్తవ పరిస్థితికి భిన్నంగా ఉన్నాయని రైతుల సాక్ష్యాలు బలపరచాలి అన్నారు. నిరంతర నీటి సరఫరా మరియు సాగునీటి స్థిరత్వాన్ని గుర్తిస్తూ, నియోజకవర్గంలోని వృద్ధులు నాయకులను ఆశీర్వదించాలి. ఇది రాజకీయ ఆందోళనల కంటే పాలనపై నమ్మకాన్ని మరింత పెంచుతుంది ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు.ఈ కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి కూటమి నాయకులు రైతులు నీటి సంఘం నాయకులు ప్రజలు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## నూతన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన

- అవగాహన కల్పించిన డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సభ్యులు




**పోతంగల్,దీక్ష ప్రభ:** నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం హెగ్డోలి గ్రామంలోని రైతు వేదికలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ అధికారులు వరి పంటలో ఆధునిక సాగు పద్ధతులపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు సీడ్ సీడ్ కం ఫెర్టిలైజర్ డ్రిల్ డ్రం సీడర్ వాడకంతో నేరుగా వరి విత్తడం, తడిపొడి పద్ధతితో నీటి యాజమాన్యం వంటి ఉపయోగాల ద్వారా లభించే ప్రయోజనాలను రైతులకు వివరించారు.ఈ ఆధునిక పద్ధతుల ద్వారా రైతులకు,పెట్టుబడి భారం తగ్గుతుందని,కూలీల ఖర్చు దాదాపు రూ.8,000/ వరకూ ఆదా అవుతుందని,సాగు సమయంలో సమయం ఆదా అవుతుందని, ఆల్టర్నేట్ వెట్టింగ్ అండ్ డ్రయింగ్ పద్ధతిలో నీటి వినియోగం నియంత్రణలో ఉండడం వంటి ప్రయోజనాలు ఉన్నట్లు తెలిపారు.వాతావరణ సమతుల్యతను కాపాడడం,వరి పొలంలో విషవాయువులను తగ్గించడం వల్ల పర్యావరణ హితం జరుగుతుందన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు, మందుల వినియోగం తగ్గించుకోవడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని చెప్పారు. మెట్ట,దుక్కి భూముల్లో ఈ పద్ధతులు అనుసరిస్తే,సమయం ఆదా కావడంతో పాటు చీడపీడల నివారణ కూడా సులభంగా చేయవచ్చని వారు వివరించారు.ఈ కార్యక్రమంలో ఏఈవో శంకర్,డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ అధికారులు వీరాస్వామి (డిప్యూటీ మేనేజర్)కమ్యూనిటీ ఫెసిలిటేటర్ ప్రశాంత్,లక్ష్మణ్ హెగ్డాలి గ్రామ సర్పంచ్ రాముచి నాగరాజు,కరోబార్ సుధాకార్, రైతులు పాల్గొన్నారు.

## తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం



- మున్సిపల్,ఎంపీటీసీ,జడ్పిటిసి ఎన్నికల్లో బిఆర్ఎస్ జెండా ఎగరవేస్తాం
- కోటగిరి మండల బీఆర్ఎస్ నాయకుడు తేల్ల రవికుమార్
- కోటగిరి మండల కేంద్రంలో బీఆర్ఎస్ క్యాలెండర్,డైరీ ఆవిష్కరణ

**కోటగిరి,దీక్ష ప్రభ:** రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కోటగిరి మండల బీఆర్ఎస్ నాయకులు తేల్ల రవికుమార్ పేర్కొన్నారు.కోటగిరి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ క్యాలెండర్ డైరీలను స్థానిక బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలతో కలిసి మంగళవారంతేల్ల రవికుమార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రస్తుతం జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలు, రాబోయే ఎంపీటీసీ జెడ్పీటీసీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ సత్తా చాటడం ఖాయమన్నారు. స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలంతా కలిసి బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరవేస్తామని చెప్పారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు.రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు తేల్ల రవి కుమార్,మోరే కిషన్,సమీర్, శ్రీనివాస్ గౌడ్,ఫారూఖ్,సూదం నవీన్, శంకర్ గౌడ్, ఎండి.నజీర్, కప్ప సంతోష్, తెల్ల చిన్న అరవింద్, గంగా ప్రసాద్ గౌడ్, రుద్రంగి సందీప్, సయ్యద్, ఆంజనేయులు, బాబు పటేల్,వడ్ల రాజు, దత్తు,అమీర్, బేగరి మారుతి, హస్కుల గంగాధర్, మసూద్,మోసిన్,సాయి తేజ,యోగేష్, మేత్రి గంగాధర్,తదితరులు పాల్గొన్నారు.

## పగిడ్యాల గ్రామంలో "చలో పోతిరెడ్డిపాడు "పోస్టర్ ఆవిష్కరణ

**మాజీ జెడ్పిటిసి వైయస్సార్ మండల కన్వీనర్ పుల్యాల నాగిరెడ్డి**



**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల గ్రామంలోని వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద “ఛలో పోతిరెడ్డిపాడు” కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను పుల్యాల నాగిరెడ్డి మాజీ జడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, వైఎస్ఆర్సిపి కార్యకర్తల సమక్షంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ,వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి,పిలుపు మేరకు,నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారాసుదీర్ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన “ఛలో పోతిరెడ్డిపాడు” కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలోసర్పంచ్ పెరుమాళ్ల శేషన్న,గోవింద రెడ్డి,పలమర్రి చెన్నయ్య, శీతారామిరెడ్డి, ప్రసాద్,రాజేష్, శివ,ఈశ్వరయ్య, సదాం,మల్యాల సుంకన్న, చిన్న మాబు,బీరప్ప,సవారి తదితరులు, అలాగే గ్రామప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన సిఎస్ఐ


- హై స్కూల్ హెచ్ ఎం.రత్న స్వామి
- సిఎస్ఐ హై స్కూల్ ఎస్ ఎంసి చైర్మన్ తాటి పాటి రమేష్

**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్ గా ఇటువలె బాధితుల స్వీకరించిన సందర్భంగా జి.వెంకట్రామిరెడ్డిని మున్సిపల్ కమిషనర్ చాంబర్లో కలవడం జరిగింది.ఈ సందర్భంగా కమిషనర్ కు దుశాల్వతో పూల మొక్క అందించి అభినందనలు తెలిపారు అనంతరం వారు మాట్లాడుతూ..సిఎస్ఐ పాఠశాల ఆవరణములో నెలకొన్న పిచ్చి మొక్కలను మరియు ఇతర సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం సమర్పించారు. అదేవిధంగా పట్టణాభివృద్ధికి మీ వంతుగా కృషి చేయాలని తెలిపారు. నందికొట్కూరు మున్సిపాలిటీ ప్రగతి పదంలో దూసుకెళ్లేందుకు కృషి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సకాలంలో అందించేందుకు కృషి చేయాలని సూచించారు.



## 345 మంది రైతులకు రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ

- ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ
- ఎమ్మెల్యే గిత్త జయసూర్య
- మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి,తాసిల్దార్ శ్రీనివాసులు



**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** నందికొట్కూరు నియోజకవర్గం మండలంశాతనకోట గ్రామంలో మన ఆస్తి మన హక్కు అని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి , తహసిల్దార్ శ్రీనివాసులు, ఆధ్వర్యంలో స్థానిక నాయకులతో కలసి 345మందికి శాతనకోట రైతులకు రాజముద్రతో పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీచేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ..వాటిలో తప్పులుంటే తహసీల్దార్ కార్యాలయం వెళ్లి సరిదిద్దుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు.భూ యజమానులకు, రైతులకు గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన పుస్తకాలను పూర్తిగా తొలిగించి,ప్రభుత్వ ఈరోజు, రాజ్యముద్రతో కూడిన రెవిన్యూ పట్టాదార్ పాస్ పుస్తకాలను అందించేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది అన్నారు.అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా శాతనకోట గ్రామానికి చెందిన టి రాధమ్మ కి 15800/ రూపాయలు మంజూరైన చెక్కును ఎమ్మెల్యే గిత్త జయసూర్య మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు ప్రభుత్వ అధికారులు పాల్గొనడం జరిగింది.

## మున్సిపల్ ఏఈ దినేష్ కుమార్ కు ఉత్తమ ఉద్యోగి అవార్డు

- మున్సిపల్ కమిషనర్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుచేత
- కమిషనర్,సహాయ ఉద్యోగులు అభినందన




**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** నందికొట్కూరు మున్సిపాలిటీలో అసిస్టెంట్ ఇంజినీర్‌కు ఉత్తమ ఉద్యోగి అవార్డు అసిస్టెంట్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న బి.దినేష్ కుమార్ ఉత్తమ ఉద్యోగి అవార్డు సర్టిఫికెట్ మున్సిపల్ కమిషనర్ జి వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా అందించారు. అధికారులు మాట్లాడుతూ..మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందించిన సమర్థవంతమైన సేవలకు గాను ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. పట్టణాభివృద్ధి,రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుధ్య పనుల్లో ఏఈ.దినేష్ కుమార్ చూపిన నిబద్ధత, క్రమశిక్షణ, బాధ్యతాయుత సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ఆయన కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జి.వెంకటరామిరెడ్డి, అధికారులు, సహోద్యోగులు, ప్రజాప్రతినిధులు ఏఈ దినేష్ కుమార్‌ను అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవలు కొనసాగిస్తూ మరింత ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి

- వ్యవసాయ సాంకేతిక యజమాన్య సంస్థ ఆధ్వర్యంలో
- వ్యవసాయ అధికారి ఏ.వో షేక్షావలి





**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** నందికొట్కూరు మండలంలోని అగ్రికల్చర్ ల్యాబ్ లో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మా) కర్నూలు జిల్లా వారి ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి జరిగింది.ఈ కార్యక్రమానికి నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి మున్న వెంకటేశ్వర్లు,పిడి ఆత్మ శ్రీలత,ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుజాత, నందికొట్కూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఏం గిరీష్,టెక్నికల్ ఏవో, నాలుగు మండలాల వ్యవసాయ అధికారులు మరియు రైతులు పాల్గొనడం జరిగింది. వ్యవసాయ అధికారులు రైతులకు సంబంధించిన ప్రత్యేక గుర్తింపు సంఖ్య రిజిస్ట్రేషన్ గురించి వివరించారు. రైతులు ఈపంట నమోదు చేసుకోవడానికి ఏపీ ఎయిమ్స్ క్రాబ్ బుకింగ్ యాప్ గురించి, వివిధ పంటల క్రాప్ స్టేజి గురించి పంటల యాజమాన్యం గురించి,కిసాన్ డ్రోన్స్ గురించి వివరించి తెలియజేశారు.

## ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీ

**నర్సింహులపేట,దీక్ష ప్రభ:** ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో జరిగిన పనులపై క్షేత్ర స్థాయిలో సామాజిక తనిఖీ బృందం పారదర్శకంగా తనిఖీలు చేపట్టనుందని ఎంపీడీవో పెనుగొండ రాధిక తెలిపారు. మంగళవారం మండల హర్షత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులు, డీఆర్పీలతో సామాజిక తనిఖీ బృందం సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలోఆమె మాటాడుతూ 20242025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకంలో 23 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన వివిధ పనులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించనున్నట్లు చెప్పారు. అందుకు రైతులు సహకరించాలని కోరారు. అదే విధంగా గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ జవాబుదారీతనంలో పని చేయాలని సూచించారు. ఎంపీవో యాకయ్య, ఏఈలు నిర్దేశించిన లక్ష్యాలను గడుపు లోపు పూర్తి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఆర్పి రంజిత్ కుమార్, ఇన్చార్జి ఏపీవో నరేష్,ఈసీ, టిఏలు తదితరులు పాల్గొన్నారు.

## బ్లాక్ డ్రెస్‌లో మాళవిక అందాల జాతర

మలయాళీ ముద్దుగుమ్మ మాళవిక మోహన్ తాజాగా వెరైటీ ఇండియా డిజైన్ చేసిన బ్లాక్ అవుట్ ఫిట్ తో అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఇటీవలే రకుల్ ప్రీత్ సింగ్ వెరైటీ డ్రెస్ తో మెస్మరైజ్ చేయగా.. ఇప్పుడు మాళవిక కూడా అలాంటి తరహా డ్రెస్ లోనే ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. టాప్ ట్రెండీ ఔట్ ఫిట్ ధరిస్తూనే.. బాటమ్ చీరకట్టులో కనిపిస్తూ సరికొత్తగా కనిపించింది. ఇక చేతులకు గోల్డెన్ కడ ధరించి తన మేకోవర్ ను ఫుల్ ఫిల్ చేసింది. ప్రస్తుతం ఇంస్టాగ్రామ్ వేదికగా పంచుకున్న ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. మలయాళ బ్యూటీగా పేరు తెచ్చుకున్న ఈమె తొలిసారి తెలుగులో ప్రభాస్ హీరోగా.. మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన ది రాజా సాబ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది.

